

సాగు బరువు..సాయం కరువు!

ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఈ ఏడాది పెరిగిన డ్రిప్ ఎరువుల ధరలు రైతుల నడ్డి విరుస్తున్నాయి. పెట్టుబడి అధికమై చివరకు అప్పలపాలు అవుతున్నారు. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

చిట్వేలి మండలం, తుమ్మచెట్లపల్లి గ్రామ శివారులో ముగ్గురు ఎర్రచందనం కూలీలను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.230
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 47 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

8 వరకు దరఖాస్తుల స్వీకరణ

రాయచోటి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన గీత కులాల మద్యం దుకాణాలకు ఈ నెల 8 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి జి. మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అలాగే దుకాణాలకు సంబంధించి ఈ నెల 10వ తేదీ కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డ్రా తీయనున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టీ-20, వన్డే టోర్నీకి ఎంపిక



శివకోటి

నందలూరు: బోర్డు ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు నేపాల్‌లో జరగబోయే టీ-20, వన్డే టోర్నీలకు ఆంధ్రరాష్ట్రం నుంచి భారత జట్టుకు నందలూరుకు చెందిన శివకోటి ఎంపికయ్యారు. బుధవారం శివకోటి ఈ విషయాన్ని విలేకరులకు తెలిపారు. తన ఎంపికకు సహకరించిన బోర్డు ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఇండియా, స్థానిక నందలూరు సబ్ సెంటర్ వారికి, సహాయ సహకారాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి 11వ క్రీడా, సాంస్కృతిక పోటీలు జరిగాయి. అన్ని విభాగాల్లో విద్యార్థులు గట్టి పోటీ ఇస్తుండడంతో రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధవారం రన్నింగ్, కబడ్డీ, హైజంప్, త్రోబాల్, క్లే మాడలింగ్ (మట్టితో ఆకృతులు), వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పరుగుందెంలో అనంతరాజుపేట, రామన్నగూడెం విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. కబడ్డీ, డిస్కస్‌త్రోలో అనంతరాజుపేట యూనివర్సిటీ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు బాస్కెట్ బాల్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బాలబాలికల బాస్కెల్‌బాల్ ఎంపికలు జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి తెలిపారు. ఇందులో బాలురకు వేంపల్లి చైతన్య హైస్కూల్లో , అలాగే బాలికలకు కడప నగరం జయనగర్‌కాలనీలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి యూత్ బాలబాలికల బాస్కెట్ బాల్ ఎంపికలు నిర్వహించబడతాయని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు జనవరి 1వ తేదీ 2009 తర్వాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. బాస్కెట్‌బాల్ ఎంపికలకు హాజరగు బాలబాలికలు తప్పని సరిగా ఒరిజినల్ ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు. జిల్లాస్థాయి పోటీలలో ఎంపికైన బాలిబాలికలకు 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 8వ రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ రాజమండ్రి జిల్లా పిఠాపురంలో ఆడాల్సి ఉంటుందని సహదేవరెడ్డి తెలిపారు.

పది ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి



ఉర్దూ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ, డీఈఓ తదితరులు

రాయచోటి అర్బన్: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని కడప డీఆర్‌ఓ మధుసూదన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పీసీఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జిల్లాస్థాయి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈఓతో కలసి ఆయన 10వ తరగతి ఉర్దూమీడియం స్టడీమెటీరియల్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రథమంగా 10వ తరగతి ఉర్దూ మీడియం మెటీరియల్‌ను తయారు చేశారని చెప్పారు. మెటీరియల్ తయారు చేసిన నిపుణులను ఆయన అభినందించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ 3 సంవత్సరాలుగా జిల్లాలో విద్యార్థులు సాధించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల గురించి వివరించారు. ఈసారి మెరుగ్గా ఎలా రాబట్టాలనే అంశంపై హెచ్‌ఎంలకు దిశా నిర్దేశం చేశారు. డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, విషయ నిపుణులు మహమ్మద్ హాషిం, షేక్ జాఫరుద్దీన్, ఇలియాస్‌బాషా,సయ్యద్ రహిమాన్, హాజిరాబాను, ఇమ్రోజ్ అలీఖాన్, హెచ్‌ఎంలు నరసింహారెడ్డి, శివారెడ్డి,జనార్దన్‌రెడ్డి, మున్వర్‌బాష పాల్గొన్నారు.

దాదాగిరి!

- జిల్లాలో అధికార పార్టీ నేతల దాడులు
- అధికారదర్పంతో భయోత్పాతానికి గురి చేస్తున్న వైనం
- ఎప్పుడూ లేని విధంగా అరాచకాలతో కొత్త చరిత్ర

సాక్షి టాస్క్‌ఫోర్స్: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి రాగానే కూటమి నేతలు అరాచకం సృష్టిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏం చేసినా చెల్లుతుందన్న నెపంతో ఇష్టారాజ్యంగా దాడులకు పూనుకుంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కొత్త తరహా ఘటనలు చోటుచేసుకుంటుండడం ఆందోళన కలిగించే పరిణామం. అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం ప్రజాస్వామ్యంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అభివృద్ధితోపాటు ఇతర సంక్షేమానికి పాటుపడేలా కృషి చేస్తూ ఎక్కడికక్కడ సంఘవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించాల్సిన బాధ్యత ఉంది. అయితే జిల్లాలో ప్రతిపక్ష పార్టీ నేతలతోపాటు ఆస్తులపై విచక్షణా రహిత దాడులు జరుగుతుండడం ప్రజాస్వామ్య వాదులను సైతం ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు, దౌర్జన్యాలుకూడా చోటుచేసుకుంటున్నాయి. అధికారం అండతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారని సాకు చూపుతూ ఆస్తులను సైతం పెకలిస్తుండడం గమనార్హం.



చెన్నముక్కపల్లె సమీపంలో రాజుల కాలనీ తాగునీటి ప్లాంటును తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

అధికారంలోకి రాగానే వేధింపులు

జిల్లాలో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే ఏదో ఒక రకంగా వేధింపులు మొదలయ్యాయి. నయానో, భయానో వారి మార్గంలోకి తెచ్చుకునేందుకు భయపెడుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోపాటు పోలీసుల ద్వారా కేసుల నెపాన్ని తీసుకొచ్చి భయపెట్టడం చర్చనీయాంశంగా మారుతోంది. అంతేకాకుండా రెండునెలల కిందట వైఎస్సార్ సీపీ పోస్టుల విషయంలో యాక్టివ్‌గా ఉన్న సోషల్ మీడియా ప్రతినిధులను కూడా అరెస్టు చేయడంతో అందరూ భయపడే పరిస్థితి నెలకొంది. కీలకమైన నాయకులపై పాత కేసులు తిరగదోడే చర్యలకు ఉపక్రమించిన పరిస్థితులు జరిగాయి. అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా ఇసుక సరిహద్దులు దాటిస్తున్నా..మద్యం షాపులకు సంబంధించి ప్రత్యేకంగా పర్మిట్ రూములు లాంటివి పెట్టుకుని నడుపుతున్నా అడిగే వారు లేకపోగా ప్రత్యర్థులు చిన్న పాటి తప్పు చేసినా చర్యలు తీవ్రంగా ఉంటున్నాయి.

వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్‌గా టీడీపీ శ్రేణులు దౌర్జన్యాలకు తెగబడుతున్నాయి. అధికారం చేపట్టిన అనంతరం ఆగస్టులో గుర్రంకొండ పోలీసుస్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులను కూర్చొబెట్టారన్న కోపంతో ఏకంగా పోలీసుస్టేషన్ పైకే టీడీపీ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. గత సెప్టెంబరుల్లో కేవీ పల్లె జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. శృతి, ఆమె భర్త గజ్జెల శ్రీనివాసులురెడ్డి ఇంటిలో లేని సమయంలో స్థానిక టీడీపీ నేతలు బీభత్సం సష్టించారు. జెడ్పీటీసీ ఇంటిపై రాళ్లతో దాడి చేసిన అనంతరం వైఎస్సార్ సీపీ కార్యకర్త తారకనాథరెడ్డిని తీవ్రంగా కొట్టి గాయపరిచి కారులో తీసుకెళ్లి రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. రాయచోటి నియోజకవర్గంలో ఇటీవల ప్రత్యర్థులపై దాడులు పెరిగిపోయాయి. అధికారం వచ్చిన మొదట్లోనే కౌన్సిలర్లకు సంబంధించిన ఇళ్ల వద్ద బైకులకు నిప్పుపెట్టారు. ఓ మహిళా కౌన్సిలర్ భర్తపై కత్తులతో దాడి చేశారు. అంతకుముందు బీసీ నాయకుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెంకటేష్ ఇంటిపై కూడా దాడి చేశారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నేత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జల్లా సుదర్శన్‌రెడ్డిపై ఎంపీడీఓపై దాడి చేశారంటూ కేసు నమోదు చేశారు. అలాగే రామాపురం మండలం కొండావాండ్లపల్లెలో వైఎస్సార్ సీపీకి చెందిన ఆదిరెడ్డి ఇల్లు కూల్చివేత, అలాగే రాచపల్లెలో ప్రభుత్వ స్థలంలో ఉందంటూ దుకాణం తొలగింపు లాంటి చర్యలకు అధికారుల ద్వారా చేయించడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. తాజాగా లక్కిరెడ్డిపల్లె మండలం జాంద్రపల్లెలో జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డెయ్య ఇంటిపై టీడీపీ శ్రేణులు మూకుమ్మడి దాడికి పాల్పడి భయోత్పాతం సష్టించడం లాంటి ఘటనలు వారి అరాచకాలను బహిర్గతం చేస్తున్నాయి. చెన్నముక్కపల్లె పరిధిలోని రాజుల కాలనీలో వైఎస్సార్ సీపీ నేతల పేర్లుగల శిలాఫలకాలను ధ్వంసం చేయడంతోపాటు మంచినీటి శుద్ధి కేంద్రాన్ని తొలగించారు. రైల్వేకోడూరులో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా మసలుతూ ఏకంగా అక్కడ కూడా బస్సు షెల్టర్, బ్రిడ్జి వద్ద శిలాఫలకాలను కూడా అప్పట్లో ధ్వంసం చేశారు. ఇలా కూటమి నేతల విచక్షణా రహిత దాడులపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.



అభివృద్ధికి ఆటంకం

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో మండల పరిషత్ పరిధిలో జరిగే సర్వసభ్య సమావేశాలను కూటమి శ్రేణులు అడ్డుకుంటుండడం ఆందోళన కలిగించే పరిణామం. అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు రూపొందించడంతోపాటు మండలపరిధిలో అనేక అంశాలకు సంబంధించి ప్రజాప్రతినిధులు చర్చించడం ఆనవాయితీ. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీకి సంబంధించిన వారే ప్రజాప్రతినిధులుగా ఉన్నారని సహించలేక నియోజకవర్గ పరిధిలో సమావేశాలుజరగకుండా అడ్డుకుంటుండడంపై చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా జిల్లా వ్యాప్తంగా దాడులుమొదలుకొని ఇతర వ్యవహారాల విషయంలోనూ తమదే పట్టు సాధించాలన్నధోరణితో కూటమి శ్రేణులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విస్మయం కలిగిస్తోంది.



రాయచోటిలో తెలుగు తమ్ముళ్లు నిప్పుపెట్టడంతో కాలిపోయిన వైఎస్సార్ సీపీ నాయకుడి కారు (ఫైల్)

లంకమల అధ్యయనానికి సిద్ధం

- పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి



మునిరత్నంరెడ్డి

బి.కొత్తకోట: సిద్దవటం లంకమల అభయారణ్యంలో 4వ శతాబ్దానికి చెందిన మానవ మనుగడ ఆధారాల సేకరణ, వాటిపై అధ్యయనానికి సిద్ధంగా ఉన్నామని భారతీయ పురావస్తు శాఖ (మైసూర్) డైరెక్టర్ డాక్టర్ కే.మునిరత్నంరెడ్డి వెల్లడించారు. అభయారణ్యంలో అటవీ సంపదను కాపాడే చర్యల్లో భాగంగా ఫారెస్ట్ రేంజర్ కళావతి అడవిలో సంచరిస్తున్న సమయాల్లో కనిపించిన మానవ మనుగడ ఆధారాలను ఫోటోల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఫోటోలను బట్టి 4 నుంచి 16వ శతాబ్దం వరకు లంకమలలో మనుషుల మనుగడ, వారి జీవనశైలి, దైవారాధన, తమ జీవన విధానాన్ని బండలపై అక్షరాలుగా చెప్పుకున్నారు. ఇదేకాక ఇంకా అధ్యయనం చేయాల్సిన, క్షేత్రస్థాయిలో పరిశీలించి కనిపెట్టాల్సిన ఎన్నో అంశాలు లంకమలలో దాగి ఉన్నాయి. వాటన్నింటిని వెలుగులోకి తీసుకొచ్చి ప్రపంచానికి లంకమల గత చరిత్రను తెలియజెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు మునిరత్నంరెడ్డి చెప్పుకొచ్చారు. ఆయన బుధవారం ఇక్కడ మాట్లాడుతూ లంకమల అభయారణ్యంలో పరిశీలనలు జరిపేందుకు అనుమతి ఇవ్వాలని తమశాఖ తరపున అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాసినట్టు చెప్పారు. జనవరి 27న రాసిన లేఖకు ఇంకా అనుమతి ఇస్తూ సమాచారం అందలేదని అన్నారు. అనుమతి వచ్చాక తమ బృందంతో లంకమలలో పరిశోధన సాగిస్తామని చెప్పారు. ఇప్పటికే వెలుగులోకి వచ్చిన ఆధారాలేకాక పరిశోధనలో మరిన్ని వెలుగు చూసే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఆధారాల సేకరణ తర్వాత లంకమల గత చరిత్రపై ఇంకా స్పష్టత వస్తుందని, ప్రతి శాసనాన్ని అధ్యయనం చేస్తామన్నారు.

మాసాంతంలోగా పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లాలో రూ. 100 కోట్ల అంచనాతో చేపట్టిన పల్లె పండుగ పనులను ఈ మాసాంతంలోగా వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ హాల్‌నుంచి పల్లె పండుగ పనులు, ఇండ్ల పనులు, ఇండ్ల నిర్మా'ప్రగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఒలు, మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి తీసుకొవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రగతిలో వెనుకబడిన కోడూరు, రాజంపేట, తంబళ్లపల్లి, మొకలకల చెరువు, బి కొత్తపేట తదితర మండలాల అధికారులతో సమీక్షించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగతి సాధనకు తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్, హౌసింగ్, డిఆర్‌డీఎ, జిఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలు, మండల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి నుంచి వైఎస్సార్ జిల్లా మీదుగా కుంభమేళాకు రెండు ప్రత్యేకరైళ్లు నడపనున్నారని కడపరైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07117 నంబరుగల తిరుపతి-ధనాపూర్ రైలు ఈనెల 14న, 18న 07119 నంబరుగల రైలు తిరుపతిలో బయలుదేరుతాయన్నారు. .తిరుగు ప్రయాణంలో ధనపూర్‌లో 07118 నంబరుగలరైలు ఈనెల 17న, అలాగే 07120 నంబరుల రైలు ఈనెల 21న రైలు బయలుదేరుతాయన్నారు. ఈ రైలు తిరుపతి, రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తా డిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్, కాచిగూడ, మల్కాజ్‌గిరి, మౌలాలి, ఖాజీపేట జంక్షన్, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, నాగపూర్, హిటార్సి, జబల్‌పూర్, ప్రయాగరాజ్, మీరజ్ పూర్‌మీదుగా ధనాపూర్‌కు చేరుతుందన్నారు.

అశ్వవాహనంపై అనంతమూర్తి



అశ్వవాహనంపై విహరిస్తున్న కడప రాయుడు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కడప కల్చరల్ : దుష్ట సంహారం చేసేందుకు ఆయన ఖడ్గం చేతబూనాడు. ఉరకలేస్తున్న సమరోత్సాహంతో ఉత్తమ అశ్వంపై వేటకు బయలుదేరాడు. ఆ వీర గంభీర రూపం శత్రువులకు చూడగానే దడపుట్టించేలా ఉంది. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, టీటీడీ సూపరింటిండెంట్ హనుమంతయ్య ఆధ్వర్యంలో అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉల్లాసభరితంగా ఊయల సేవను నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు రాత్రి కనుల పండువగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఆ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పూజా ద్రవ్యాలు సమర్పించి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు చక్రస్నానం

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దేవునికడప మాడవీధుల్లో భక్తులు, ఆలయ నిర్వాహకులు, అర్చక బృందాలు వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయం ఎదుట గల పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు అవభృథస్నానము నిర్వహింపజేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు యథావిధిగా ఊంజల్ సేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తిగీతాలాపనలు ఉంటాయి. రాత్రి హంస వాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగిస్తారు. 8 నుంచి 9.00 గంటల్లోపుగా ధ్వజావరోహణం చేస్తారు.

దిన్నెలలో.. గజ ఘీంకారం

తలకోన (శేషాచలం) అటవీ ప్రాంతం నుంచి రెండు ఏనుగులు గుంపునకు దూరంగా వచ్చేశాయి. మళ్లీ కలవడానికి ప్రయత్నించగా వాటిని మళ్లీ రానివ్వలేదు మరో ఏనుగుల గుంపు. దీంతో అవి ఆందోళనతో పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తున్నాయి.

- బృందం నుంచి విడిపోయిన రెండు ఏనుగులు
- తలకోన నుంచి దిన్నెల అడవిలోకి ప్రవేశం
- పంటలను ధ్వంసం చేస్తున్న గజరాజులు





సానిపాయ్ రేంజ్ పరిధిలోని వరిపైరులో ఏనుగుల అడుగులు

రాజంపేట: తిరుపతి, అన్నమయ్య జిల్లా సరిహద్దులో ఉన్న శేషాచలం అడవుల్లో ఏనుగుల గుంపు నుంచి రెండు ఏనుగులు రాజంపేట నియోజకవర్గంలోని సానిపాయి రేంజ్ పరిధిలో దిన్నెల అటవీ ప్రాంతంవైపు వచ్చేశాయి. అవి అటవీ గ్రామాల శివార్లలో ఉన్న పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయని అటవీ అధికారులు భావిస్తున్నారు. రెండు రోజులుగా ఇవి భీకరంగా అరుస్తూ సంచరిస్తున్నాయి. దీంతో రైతులు గజగజ వణికిపోతున్నారు. వీటి దాడుల వల్ల నష్టపోతున్నామని వాపోతున్నారు.

ఎక్కడెక్కడా సంచరిస్తాయంటే...

ఏనుగుల గుంపు చిత్తూరు జిల్లా నుంచి కడప జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతానికి చేరుకుంటున్నాయి. గతంలో రైల్వేకోడూరు అటవీ రేంజ్ పరిధిలో ఏనుగులబావి, దొంగబండ, రాజంపేట రేంజ్ పరిధిలో ఈతకాయలబండ, తుమ్మలబైలు, పింఛా అటవీ పరిసర ప్రాంతాల్లోని అంబానిబావి సమీపంలో ఇవి సంచరించాయి.దట్టమైన చెట్లతో ఉన్న శేషాచలం అడువులు కడప, రైల్వేకోడూరు, చిత్తూరు జిల్లాల మధ్య విస్తరించి ఉన్నాయి. ఏనుగులు ప్రస్తుతం అటవీ ప్రాంతంలోనే కాలం గడుపుతున్నాయి.

తాజాగా రాజంపేట డివిజన్ పరిధిలోని సానిపాయి రేంజ్ పరిధిలో నగిరి, శివరాంపురం, ఆరోగ్యపురం, కావలిపల్లె, ఐయ్యవారిపల్లె గ్రామాలకు సంబంధించి అటవీ శివార్లలో ఉన్న పంటపొలాలపై ఆ రెండు ఏనుగులు పడి నాశనం చేశాయి. అధికారులు కూడా నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేసే పనిలోపడ్డారు. మంగళవారం రాత్రి కూడా పంట పొలాల్లోకి వచ్చి వెళ్లినట్లు అటవీ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ రెండు ఏనుగులు మధ్య వయస్సు కలిగినవని చెబుతున్నారు. ముడుంపాడు, రాయవరం ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీసిబ్బంది హెచ్చరిస్తున్నారు.

» ధ్వంసమైన పంటలివే..

రెండు ఏనుగుల బీభత్సం ఫలితంగా వరి, ఉలవ, టమోటా, అలసందలు, వేరుశెనగ పంటలు ధ్వంసం అయ్యాయి. పంటపొలాకు వేసిన కంచెను సైతం పీకి పడేశాయి. 10 నుంచి 15 సంవత్సరాలు కలిగిన టెంకాయచెట్లను వేళ్లతో సహా పెకిలించేశాయి. సాగునీటి పైపులైను ధ్వంసం చేశాయి. బాధితరైతులను ఇప్పటికే అటవీశాఖ గుర్తించింది.

ఏనుగులను అడవిలోకి పంపించడానికి చర్యలు



ఏనుగులను అడవిలోకి పంపించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటవీసిబ్బంది ద్వారా గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నాం. సంబంధిత శాఖల అధికారులు ద్వారా పంట నష్టం వివరాలు సేకరిస్తాం. -జగన్నాథసింగ్, జిల్లా అటవీశాఖాధికారి, రాజంపేట

అసాంఘిక నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఏర్పాటు

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: అసాంఘిక నేరాల అదుపుకోసం సాంకేతికత ఆధారంగా జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. నిఘా వ్యవస్థను మెరుగుపరచడం, జిల్లాలో నేరాలను అదుపు చేయడానికి, ప్రజల భద్రతను మెరుగుపరచడానికి సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటుకు సన్నాహాలు చేయాలన్నారు. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించవచ్చాన్నారు. జిల్లాలోని ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హైవేలు, ప్రార్థనా మందిరాలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారన్నారు. సమావేశంలో ప్రాజెక్టు ప్రణాళిక అమలు, భవిష్యత్తు గురించి చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటులో వేగం, నాణ్యతను మెరుగుపరచాలన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ యు వెంకటాద్రి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, కమ్యునికేషన్ సిబ్బంది, ఐటి కోర్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



దుంగలు, నిందితులతో ఏఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

చిట్వేలి : చిట్వేలి మండలం, తుమ్మచెట్లపల్లి గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముగ్గురు ఎర్రచందనం కూలీలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 దుంగలను, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ మనోజ రాంనాథ్ హెగ్డే తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తుమ్మచెట్లపల్లి గ్రామ శివారులో నిందితుడు తుంగా శరణ్ (35) పొలానికి సమీపంలోని వంకవద్ద ఏపీ26ఏజే 7706 నంబరుగల ట్రాక్టర్‌లో దుంగలను లోడ్ చేస్తుండగా రైల్వేకోడూరు మండలానికి చెందిన కుంబా వెంకటరమణ(35), కోటకొండ నాగేంద్ర (48)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరికొందరు పారిపోయారన్నారు. వీరి వద్ద నుంచి 278 కేజీల బరువు గల 12 దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 4 లక్షలు ఉంటుందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రఘురాం, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తట్టివారిపల్లె చెరువులో మృతదేహం కలకలం

మదనపల్లె : మండలంలోని తట్టివారిపల్లె చెరువులో మృతదేహం తేలుతోందని బుధవారం సాయంత్రం స్థానికులు గుర్తించడంతో కలకలం రేగింది. తట్టివారిపల్లె చెరువును ఆనుకుని ఉన్న దాబాకు వెనుక వైపున ఉన్న చెరువులో ఓ మృతదేహం కంపచెట్ల మధ్య ఇరుక్కుపోయి ఉండటం గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఘటనాస్థలం తమ పరిధిలోకి రాదని టూటౌన్ పోలీసులు చెప్పగా, తమ పరిధి కాదని తాలూకా పోలీసులు చేతులెత్తేయడంతో పాటు రాత్రి కావడంతో మృతదేహాన్ని బయటకు తీయలేదు. దీంతో మృతి చెందింది ఆడ లేక మగ అనే విషయమై స్పష్టత లేదు. గురువారం ఉదయం పోలీసులు ఎవరి పరిధిలో ఉందో నిర్ణయించుకుంటే, మృతదేహం వెలికి తీసే అవకాశం ఉంది.

కోడిపందెం విషయమై యువకుల ఘర్షణ



శ్రీరాంనగర్‌లోకి వచ్చి దాడి చేస్తున్న యువకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పంచాయతీ శ్రీరాంనగర్ వీధిలో కోడి పందేలు ప్రాణం మీదకు తెచ్చిన సంఘటన బుధవారం జరిగింది. కొందరు యువకులు జట్టుగా ఏర్పడి కోడి పందేలు నిర్వహించుకున్నారు. పందెంలో ఓడిపోయిన కోడిని వండుకొని తింటూ మద్యం తాగుతూ గొడవ పడ్డారు. అనంతరం అక్కడి నుంచి అందరూ వెళ్లిపోయారు. తర్వాత శ్రీరాంనగర్‌లో ఉంటున్న మణి, గోపి, దేవి, హేమ, గణేష్ తదితరులపై బుడుగుంటపల్లికి చెందిన శ్రీను అతని అనుచరులు కట్టెలు, కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సాగు బరువు.. సాయం కరువు!

- రోజురోజుకు పెరుగుతున్న ఎరువుల ధరలు
- రెట్టింపు అవుతున్న పెట్టుబడులు
- రైతులను ఆదుకోని ప్రభుత్వం
- మొక్కుబడిగా వ్యవసాయశాఖ పనితీరు



డ్రిప్ విధానంలో అరటిపంట

రైల్వేకోడూరు అర్బన్ : జిల్లాలోని కోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లె నియోజకవర్గాలలోని రైతులు అన్ని రకాల పంటలను డ్రిప్ పద్ధతి ద్వారా సాగు చేస్తుంటారు. ప్రకృతి ప్రకోపాలు, పంటలపై పురుగుల దాడులు, వైరస్‌లు, తెగుళ్లు, పెరిగిన కూలీల భారానికి తోడు ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఈ ఏడాది పెరిగిన డ్రిప్ ఎరువుల ధరలు రైతుల నడ్డి విరుస్తున్నాయి. పెట్టుబడి అధికమై చివరకు అప్పులపాలు అవుతున్నారు.

ప్రభుత్వ సహకారం కరువు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతకు ఆసరాగా నిలిచింది లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడి ఇవ్వలేదు. వ్యవసాయశాఖ ద్వారా మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న రైతులకు ఎంతో అవసరమైన ఎరువులను సబ్సిడీపై ధరలు తగ్గించి ఇస్తే వారికి పెట్టుబడి తగ్గి చేదోడుగా ఉంటాయి. కానీ ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. దీంతో జిల్లాలోని రైతులు అరటి, బొప్పాయి, మామిడి, దోస, మిరప, టమాటా తదితర పంటలు సాగు చేసే రైతులు ప్రభుత్వం నుంచి సహకారం అందక పెట్టుబడులకు అప్పులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఎరువుల అంగళ్లు..

జిల్లాలో ఎరువుల అంగళ్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరైతే రైతులకు బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు జరుపుతున్నారు. అలాగే పలు అంగళ్లలో ధరలు తేడాలు ఉంటున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అన్నీ తెలిసినా వ్యవసాయ అధికారులు అంగళ్ల యజమానుల చేతుల్లో కీలు బొమ్మల్లా ఉన్నారనే విమర్శలున్నాయి.

భూసార పరీక్షలతో ప్రయోజనం

రైతులు పంట పండించే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల పెట్టుబడులు తగ్గే అవకాశముంది. భూమిలో పోషకాలు, లోపాలు ముందే తెలుసుకోవడం వల్ల వ్యవసాయ అధికారుల సలహా మేరకు అవసరమైన పోషకాలు పంటకు అందించవచ్చు. దీనివల్ల మితిమీరి అవసరం లేని ఎరువులను వాడకుండా రైతులకు పెట్టుబడులు తగ్గే అవకాశం ఉంది. రైతులు భూసార పరీక్షలకు దరఖాస్తు చేసుకుంటే వ్యవసాయ అధికారులు పరీక్షించి సలహాలు సూచనలు ఇస్తారు. ఈ కార్యక్రమం కూడా సజావుగా సాగడం లేదు.

ఎరువుల ధరల వివరాలు ఇలా..

డ్రిప్ ఎరువులు	2024	2025
28-28-0.	2800	4000
నానో డీఏపీ	480	550
లిక్విడ్ పొటాష్	600	700
20- 20- 20	3200	4000
19- 19 -19	2900	3150
13-40 - 13	3600	4000
12-61- 00	2800	3800
00-52-34	4800	5000
13-00-45	2800	3200

జిల్లాలో డ్రిప్‌సాగు వివరాలు

నియోజకవర్గం	హెక్టార్లు
రైల్వేకోడూరు	12950
రాయచోటి	10595
రాజంపేట	8833
మదనపల్లె	8058
పీలేరు	15709
తంబళ్లపల్లి	15579

పెట్టుబడులు అధికమయ్యాయి



వ్యవసాయం చేయాలంటే ఏటా పెట్టుబడులు అధికమవుతున్నాయి. పంట పెట్టినప్పుడల్లా ఎరువులు, కూలీలు అధికమై పెట్టుబడి రెండింతలు అవుతోంది. పెరిగిన ఎరువుల ధరలు, కూలీలు. తీరా పంట పండిస్తే దళారుల మోసాలు. వ్యవసాయం చేయాలంటే ప్రతి ఒక్కరికి భారంగా ఉంది.

– ప్రతాప్‌రెడ్డి, ఆదర్శరైతు, రైల్వేకోడూరు మండలం.

చిన్న రైతులు అప్పులు చేస్తున్నారు



పదేళ్ల క్రితం నాటికి ఇప్పటికీ వ్యవసాయంలో చాలా తేడాలు వచ్చాయి. ప్రతి విషయంలో పేద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సాయంగా ఎన్నో పథకాలు అమలుచేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఇంతవరకు ఒక్కటి కూడా అమలు చేయలేదు.

– ముద్దులూరు సుబ్బరామరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైల్వేకోడూరు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపితే చర్యలు



కోడూరు పరిధిలోని ఎరువుల దుకాణాలలో నిబంధనలకు వ్యతిరేకంగా అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ప్రతి రైతుకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలి. నిర్ణయించిన ధరల కంటే అధికంగా అమ్మితే చర్యలు తీసుకుంటాం. అవకతవకలు జరిగితే రైతులే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. – జి.రమేష్, మండల వ్యవసాయశాఖ అధికారి, రైల్వేకోడూరు.

రాజంపేటలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని అఖిల

రాజంపేట : రాజంపేట మండలం కొత్త బోయినపల్లెలోని ఓ హాస్టల్‌లో బుధవారం ఇంజినీరింగ్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అఖిల (23)అనే విద్యార్థిని అన్నమాచార్య యూనివర్సిటీలో సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతోంది. ఆమెది అనంతపురం జిల్లా సి. చిక్కేపల్లి, పెద్దపప్పూరు అని విద్యార్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ అలీ తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభాలు

నందలూరు : మండలంలోని కుంపిణీపురం శ్రీ భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవరోజు బుధవారం సాయంత్రం నిర్వహించిన బండలాగుడు పోటీలు అలరించాయి. కడప జిల్లా చౌటపల్లికి చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో, అనంతపురం జిల్లా వరదాయపల్లెకు చెందిన వృషభాలు రెండో స్థానంలో, మార్తల సూరారెడ్డి వృషభాలు నిలిచాయి. రాత్రి కుంపిణీపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతు మృతికి టీడీపీ నాయకుడే కారకుడు



ప్రజాసంఘాల నాయకులతో వాగ్వాదం చేస్తున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ



మార్చురీ వద్ద రైతు నరసింహులు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్

- కేసు తారుమారుకు తాలూకా సీఐ ప్రయత్నం
- మృతదేహంతో రోడ్డుపై ఆందోళనకు సిద్ధమైన ప్రజా సంఘాల నాయకులు
- పోలీసులు ప్రజా సంఘాల నేతల మధ్య వాగ్వాదం
- ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ మార్పు చేసిన పోలీసులు

మదనపల్లె : మండలంలోని పొన్నూటిపాళెం పంచాయతీ పిచ్చలవాండ్లపల్లెకు చెందిన రైతు నరసింహులు మరణానికి టీడీపీ నాయకుడే కారకుడని, కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కాపాడేందుకు పోలీసులు నానాతంటాలు పడుతున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం బహుజనసమాజ్‌పార్టీ(బీఎస్పీ) ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకుని, రైతు నరసింహులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలిపేందుకు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, శవాన్ని బయటకు తరలించకుండా మార్చురీ గదికి తాళం వేశారు. దీంతో ఆగ్రహించిన ప్రజాసంఘాల నాయకులు, మృతుడు నరసింహులు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తుంటే.. తాలూకా సీఐ కళా వెంకటరమణ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సీఐ కళా వెంకటరమణకు, పీటీఎం.శివప్రసాద్, బందెల గౌతమ్ కుమార్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకుడు రెడ్డెప్పనాయుడు కారణంగా దారి సమస్యను ఎదుర్కొంటున్నానని, సోమవారం సబ్ కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చిన రైతు నరసింహులు..మరుసటిరోజు ఉదయం అతడి పొలంలోని నేరేడు చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపిస్తే పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. టీడీపీ నాయకులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, అందుకే మృతదేహానికి పోస్టుమార్టం జరగనివ్వకుండా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా ఆత్మహత్య కేసుగా నమోదు చేశారని ఆరోపించారు. దళితుడిని టీడీపీ నాయకుడు చంపేశాడని కుటుంబ సభ్యులు మొత్తుకుంటున్నా, వారి ఆవేదనను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడంపై ధ్వజమెత్తారు. దీంతో కాసేపు జిల్లా ఆస్పత్రిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజాసంఘాల నిరసనతో దిగివచ్చిన పోలీసులు ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేసి ఇస్తామని, మధ్యాహ్నం 2 గంటల వరకు గడువు కావాల్సిందిగా కోరారు. అనంతరం ఎఫ్ఐఆర్‌లో నిందితుడైన టీడీపీ నాయకుడు రెడ్డెప్పనాయుడును ఆత్మహత్యకు బాధ్యుడుగా పేర్కొంటూ 108 బీఎన్ఎస్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తూ మార్పుచేశారు. దీంతో శాంతించిన ప్రజా సంఘాలు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబస భ్యులకు అప్పగించి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే, మరోసారి ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు.

హార్సిలీహిల్స్ టోల్ స్వాధీనం

వీఆర్‌ఏల ద్వారా టోల్ వసూళ్లకు సబ్ కలెక్టర్ ఆదేశం



ఎంట్రీ ఫీజు వసూలు చెక్ పోస్టును స్వాధీనం చేసుకున్న రెవెన్యూ సిబ్బంది

బి.కొత్తకోట : పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ పైకి వెళ్లే సందర్శకుల నుంచి వసూలు చేసే టోల్‌ను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 30న ఎంట్రీ ఫీజు వసూళ్ల కోసం వేలంపాట నిర్వహించారు. 20 మంది దాకా పాల్గొనగా కలకడ మండలానికి చెందిన సి.అనిల్ కుమార్ ఎవరూ ఊహించని విధంగా రూ.45.20 లక్షలకు పాట దక్కించుకున్నాడు. తర్వాత అక్టోబర్ 1 నుంచి టోల్ వసూళ్లను ఒప్పందం మేరకు చేపట్టాల్సి ఉంది. అయితే 17వ తేదీ వరకు ఒప్పందం చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఆ 17 రోజులకు సంబంధించి రెవెన్యూ సిబ్బంది రూ.3,26,560 ఎంట్రీ ఫీజు వసూలు చేశారు. 18వ తేదీ నుంచి అనిల్ కుమార్ లీజు ఒప్పందం చేసుకుని వసూళ్లు ప్రారంభించాడు. అయితే లీజుదారు రూ.45.20 లక్షలకు గాను రూ.10 లక్షలు మాత్రమే చెల్లించి ఒప్పందం ప్రకారం జరగాల్సిన మిగతా చెల్లింపులు చేయలేదు. దీనికోసం సబ్ కలెక్టర్ పలుమార్లు నోటీసులు జారీచేసినా తీసుకోలేదు. దీంతో టోల్ గేట్ వద్దకు వెళ్లి నోటీసు సిబ్బందికి ఇవ్వాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో మూడు నెలలు గడిచినా ఒప్పందం ప్రకారం వేలం సొమ్ము చెల్లించలేదు. దీంతో పాటదారునికి అప్పగించిన టోల్ వసూళ్ల లీజు రద్దు చేస్తూ హార్సిలీహిల్స్ టౌన్ షిప్ కమిటీ చైర్మన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చెక్ పోస్టు స్వాధీనం

బుధవారం ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్ఓ వరదరాజులు టోల్ వసూలు చేస్తున్న చెక్ పోస్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది నుంచి రేకులషెడ్డుతో పాటు ఎంట్రీ ఫీజు రసీదుల పుస్తకాలు, ఇతర వాటిని స్వాధీనం చేసుకున్నారు. కాగా ఎంట్రీ ఫీజు వసూలుకు మూడు షిఫ్టుల్లో ముగ్గురు వీఆర్ఏలను నియమించి విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అజారుద్దీన్‌ను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం



కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని నిరసన తెలుపుతూ ఏపీ రైతు సంఘం ప్రతినిధులు బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. బుధవారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం వద్దగల అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో రైతుల కడుపుకొట్టి కార్పొరేట్లకు పరమాన్నం పెట్టిందన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రైతులకు ఇచ్చే సబ్సిడీలలో కూడా కోత పెట్టడం దారుణమన్నారు. ఫలితంగా వ్యవసాయం భారంగా మారి రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, రాయచోటి రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరినాథనాయుడు, బాలక్రిష్ణారెడ్డి, సభ్యులు రామచంద్రారెడ్డి, వెంకటేశు, రైతులు పాల్గొన్నారు.

కంది బేడల పంపిణీ నిల్

- బియ్యం, చక్కెరతో సరి పెట్టారు
- జిల్లాలో 4.98 లక్షల కార్డుదారుల నిరీక్షణ

పెద్దతిప్పసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్డుదారులకు రేషన్ సరుకులన్నీ పంపిణీ చేస్తామన్న పాలకులు ఆరంభంలో ఆర్భాటం చేసి చేతులు దులుపుకుంటున్నారు. మార్కెట్‌లో భగ్గుమంటున్న నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని రేషన్ సరుకులతో సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తామని ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు కాకపోవడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,98,092 రేషన్ కార్డులు ఉండగా కార్డుల్లో మొత్తం 14,92,977 మంది సభ్యులుగా ఉన్నారు. అయితే కార్డుదారులకు ప్రతి నెలా బియ్యంతో పాటు చక్కెర, రాగులు, జొన్నలు, ప్రధానంగా కందిబేడలు పంపిణీ చేసేవారు. అయితే కంది బేడలు ముచ్చటగా మూడు నెలలు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకోగా ఈ నెల కోటాకు మాత్రం కేవలం బియ్యం, చక్కెర పంపిణీతోనే సరిపెట్టుకున్నారని కార్డుదారులు మండి పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం ఎదురు చూసిన కార్డుదారులకు ఈ నెల నిరాశే ఎదురైంది. ఈ విషయంపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరెడ్డిని వివరణ కోరగా కంది బేడలు ఇక్కడే కాదు జిల్లాలో ఎక్కడా స్టాక్ రాలేదన్నారు. వచ్చిన వెంటనే కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు.

బైకుపై ఎక్కించుకుని దోపిడీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన పడిగపాటి శివరామిరెడ్డిని నమ్మించి బైకుపై ఎక్కించుకొని దోపిడి చేసి బంగారు ఉంగరం, సెల్ ఫోన్ దొంగిలించిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ విషయంపై ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు..పోట్లదుర్తి గ్రామానికి చెందిన పడిగపాటి శివరామిరెడ్డి పోట్లదుర్తి రోడ్డుపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైకుపై వచ్చి తాను కూడా అటు వైపు వెళ్తున్నాని చెప్పి నమ్మించి శివరామిరెడ్డిని బైకుపై ఎక్కించుకున్నాడు. బైకును హనుమనగుత్తి గ్రామ సమీపంలోని విశాలమైన ప్రదేశంలోకి తీసుకెళ్లి బెదిరించి శివరామిరెడ్డి వద్ద ఉన్న అర్ధతులం బంగారు ఉంగరం, కీప్యాడ్ సెల్‌ను లాక్కుని వెళ్లాడు. వెంటనే బాధితుడు రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.


నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు



నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని టి.చౌదరివారిపల్లె గ్రామంలో 25 మంది రైతులు ఖాజీపేటకు చెందిన పుత్తా ట్రేడర్స్‌లో ఆర్ఎన్ఆర్-15048 రకం వరి విత్తనాలను కొనుగోలు చేసి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 200 ఎకరాల్లో పంట సాగు చేయగా 20 రోజుల్లో వెన్ను రావడంతో వీరు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌ను సంప్రదించారు. దీంతో ఆయన నకిలీ విత్తనాలతో సాగైన వరి పైర్లను పరిశీలించారు. అయితే రైతులు ఇప్పటికే సాగు కోసం రూ.30వేలు ఖర్చు చేశామని వెన్ను 20 రోజుల్లోనే వస్తుండంతో పంట దక్కదని ఏఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఏఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించి దీనిపై విచారణ చేయిస్తామన్నారు.

ఐదెకరాల్లో సాగు చేశాను



పుత్తా ట్రేడర్స్ దుకాణంలో ఆర్ఎన్ఆర్ రకం విత్తనాలను కొనుగోలు చేశాను. ఇప్పటికే వరి సాగు కోసం రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టాను. వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేదు. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో సాగు చేశాను. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలి.

– పెద్ద వీరారెడ్డి, బాధిత రైతు, చౌదరివారిపల్లె గ్రామం

కంపెనీ విత్తనాలు అనుకుని మోసపోయాం



నాకున్న 4 ఎకరాల పొలంలో వరి సాగు చేశాను. 20 రోజులకే వెన్ను రావడంతో పంట వస్తుందా లేదా అనే సందేహంలో ఉన్నా. ఇప్పటికే రూ.1.20 లక్షలు సాగు కోసం ఖర్చు అయింది. పంట రాకపోతే తీవ్రంగా నష్టపోతా. వ్యవసాయాధికారులు కంపెనీ వారిపై చర్యలు తీసుకోవాలి.

– వీరారెడ్డి, బాధిత రైతు, చౌదరివారిపల్లె

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : భార్య కాపురానికి రాలేదని చిన్నయ్య (37) అనే వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జమ్మలమడుగు మండలంలో జరిగింది. పట్టణ సీఐ ఎస్. లింగప్ప కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చిన్నయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య వరలక్ష్మి, బిడ్డలను పోషించుకునేవాడు. ఇటీవల వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. దీంతో అతను మద్యానికి బానిస అయ్యాడు. భార్యను పలుమార్లు పిలిచినా ఆమె రాకపోవడంతో మనస్థాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు మండల పరిధిలోని రామిరెడ్డి కొట్టాలు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని అక్కదేవతల కాలనీకి చెందిన చందూ (18) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు అక్కదేవతల కాలనీకి చెందిన చందూ అదే కాలనీకి చెందిన రఘునాథ్, బాలు అనే మరో ఇద్దరు యువకులతో కలిసి కడప నగరానికి ఆధార్ కార్డు పని నిమిత్తం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. రామిరెడ్డి కొట్టాలు సమీపంలో గొర్రె అడ్డు రావడంతో వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పింది. దీంతో బైక్ వెనుక వైపున కూర్చున్న చందూ ఒక పక్కకు ఒరిగిపోయాడు. అదే సమయంలో శాటిలైట్ సిటీకి చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి తోల్ల గంగనపల్లె వైపు నుంచి బైక్‌పై ఇంటికి వెళుతూ వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చందూ తల నుజ్జు నజ్జుగా మారి తీవ్ర రక్త స్రావమైంది. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.